సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 10 । మార్చి । 2024



చిన్నారి గుండెకు ఊపిరి

ఆరోగ్యశ్రీ పథకం ఆ చిన్నారికి ఆయువు పోసింది. భీమవరం జిల్లా నరసాపురానికి చెందిన లక్ష్మీసౌమ్య(6)కు గుండె శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది.


II లో



వెంకన్న క్షేత్రం.. ఆధ్యాత్మిక శోభితం

వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం కిక్కిరిసింది. ఉదయం నుంచీ అధిక సంఖ్యలో భక్తులు గౌతమీ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు.

డెల్టాలకు 8,970 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.80 అడుగులుగా నమోదైంది.

బాలాజీ స్వామి.. సదా స్మరామి



స్వామివారి సన్నిధిలో లక్ష్మీనారాయణ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు దీరిన బాలాజీ స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి తమ కోర్కెలు నెరవేరాలని స్వామివారిని వేడుకున్నారు. ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. స్వామివారి సన్నిధిలో లక్ష్మీనారాయణ హోమంలో పలువురు భక్త దంపతులు పాల్గొన్నారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.2.35 లక్షల ఆదాయం వచ్చింది. టిక్కెట్లు, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.1.60 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.74,074 విరాళాలుగా సమర్పించారు. 3,459 మంది రాగా, 2,571 మంది భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ ఏర్పాట్లను ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీనివాస్, సూరిబాబు పర్యవేక్షించారు.

సీట్లు పక్కనపెట్టి.. కుర్చీ మడత పెట్టి..

- టీడీపీలో బీసీల డిక్లరేషన్‌పై పెదవి విరుపు
- జిల్లాలో ఒక సీటు మాత్రమే ఇచ్చే అవకాశం
- వైఎస్సార్ సీపీలో బీసీలకు, శెట్టిబలిజలకు ప్రాధాన్యం
- మూడు అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాల కేటాయింపు
- టీడీపీలో సముచిత స్థానం ఇవ్వాలని శెట్టిబలిజల అల్టిమేటం
- తిరుగుబాటు జెండా ఎగురవేసి మెత్తబడిన రెడ్డి సుబ్రహ్మణ్యం



గురువారం రాత్రి కొత్తపేట సమావేశంలో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో టీడీపీపై నిరసన గళం వినిపించేందుకు ఐక్యత చాటుతున్న శెట్టిబలిజ నాయకులు

సాక్షి, అమలాపురం/కొత్తపేట: చెప్పేదొకటి.. చేసేదొకటి అన్నట్లు టీడీపీ తీరు ఉంది.. తమ పార్టీకి బీసీలు బ్యాక్‌బోన్ అని ప్రకటిస్తూనే పెట్టాల్సిన పొగ పెట్టేస్తుంది.. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆ పార్టీ సీట్ల కేటాయింపులో బీసీలకు ఎంత ప్రాధాన్యం ఇచ్చిందో తెలుసుకుంటే అందరూ విస్తుపోవాల్సిందే.. జిల్లాలో ప్రస్తుతం ఇది హాట్ టాపిక్ అయ్యింది.. ఎన్నికల వేళ బీసీ డిక్లరేషన్‌పై టీడీపీ నేతలే పెదవి విరుస్తున్నారు. ఆ పార్టీ అధినేత చంద్రబాబు మాటలను బీసీలు విశ్వసించడం లేదు. టిక్కెట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వకుండా స్వప్రయోజనాల కోసం సొంత పార్టీకి చెందిన బీసీలను బలి చేయడంపై సర్వత్రా నిరసన సెగ రాజుకుంటోంది. జిల్లాలో బీసీలకు అరకొర ప్రాధాన్యం ఇవ్వడంపై పార్టీ జెండా మోస్తున్న నాయకుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన శెట్టిబలిజలు, మత్స్యకారులు, దేవాంగ వర్గాల వారు జిల్లాలో అత్యధికంగా ఉన్నారు. ప్రతి నియోజకవర్గంలో గెలుపోటములను వీరు ప్రభావితం చేస్తారు. ముఖ్యంగా శెట్టిబలిజలు కోనసీమతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాలో బలంగా ఉన్నారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనూ, తరువాత ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనూ వారికి రాజకీయంగా కీలక పదవులు లభించాయి. ఇది చూసే టీడీపీలో సైతం తమకు అదే స్థాయి ప్రాతినిధ్యం ఉండాలని వారూ కోరుకుంటున్నారు. వారితో పాటు బీసీల్లో మత్స్యకారులు సైతం తమ ప్రాధాన్యాన్ని గుర్తించి అధిక సంఖ్యలో సీట్లు కేటాయించాలని ఆశిస్తున్నారు. శెట్టిబలిజలు, మత్స్యకారులతో పాటు సుమారు 1.25 లక్షల మంది బీసీలున్న ముమ్మిడివరం అసెంబ్లీ పట్టుమని పది వేల మంది కూడా లేని క్షత్రియ సామాజిక వర్గానికి సీటు కేటాయించడం బీసీలకు మింగుడుపడని అంశంగా మారింది.

శెట్టిబలిజల్లో అసంతృప్తి సెగ

జిల్లాలో ఏడు నియోజకవర్గాలుండగా, ఇందులో అమలాపురం, రాజోలు, పి.గన్నవరం ఎస్సీలకు రిజర్వ్ అయ్యాయి. మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో టీడీపీ కొత్తపేటలో బండారు సత్యానందరావు, మండపేటలో వేగుళ్ల జోగేశ్వరరావు, ముమ్మిడివరం దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు)కు ఇప్పటికే అవకాశం కల్పించారు. మిగిలిన రామచంద్రపురం జనరల్ కేటగిరీ. ఇక్కడ నుంచి జనసేనకు అవకాశం ఇస్తారని ఓసారి, టీడీపీ పోటీ చేస్తుందని మరోసారి ప్రచారం జరుగుతోంది. టీడీపీ నుంచి అవకాశమిస్తే పార్టీలో కొత్తగా చేరిన శెట్టిబలిజ వర్గానికి చెందిన వాసంశెట్టి సుభాష్ పేరు వినిపిస్తోంది. బీసీలలో మత్స్యకారులు, ఇతర వర్గాల వారికి మరెక్కడ నుంచీ పోటీ చేసే అవకాశం లేదు. టీడీపీలో శెట్టిబలిజలకు పెద్దగా అవకాశం రాకపోవడంతో ఆ వర్గానికి చెందిన నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వీరు పార్టీపై తిరుగుబాటు జెండా ఎగుర వేస్తున్నారు. వారికి శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్, రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం (ఆర్‌ఎస్) నాయకత్వం వహించారు. వైఎస్సార్ సీపీలో మాజీ మంత్రి పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ను రాజ్యసభ సభ్యుడిని చేయడం, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు మంత్రి పదవి ఇవ్వడం, కోనసీమ జిల్లాకు చెందిన కుడుపూడి సూర్యనారాయణరావుకు, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కవురు శ్రీనివాస్‌కు ఎమ్మెల్సీ పదవులు ఇవ్వడాన్ని టీడీపీ బీసీ నేతలు గుర్తు చేస్తున్నారు. టీడీపీ శెట్టిబలిజ సామాజిక వర్గాన్ని గాలికొదిలేసిన నేపథ్యంలో సొంత సామాజిక వర్గీయుల వద్దకు వెళ్లి పార్టీకి ఓట్లు వేయమని ఎలా అడగగలమని వారు వాపోతున్నారు. సముచిత స్థానం ఇవ్వకపోతే పార్టీతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. అయితే రెడ్డి సుబ్రహ్మణ్యంకు టీడీపీ అధినేత చంద్రబాబు నుంచి శనివారం ఫోన్ రావడంతో కాస్త మెత్తబడినా, మిగిలిన బీసీ నేతలు మాత్రం పోరుబాటు పడుతున్నారు. అవసరమైతే టీడీపీని వీడి తమకు ప్రాధాన్యం ఇస్తున్న వైఎస్సార్ సీపీలో చేరుతామని వారు చెబుతుండడం విశేషం.

ఇల్లూ మీదే.. హక్కులూ మీవే

- మంత్రి పినిపే విశ్వరూప్
- ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు అందిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ

అల్లవరం: ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా, లబ్ధిదారులకు సర్వ హక్కులూ కల్పిస్తూ రిజిస్ట్రేషన్ పత్రాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శనివారం అల్లవరం ఉన్నత పాఠశాలలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు అందజేయడమే కాకుండా, వాటికి రిజిస్ట్రేషన్ చేసి స్థలంపై హక్కు కల్పించామన్నారు. నవరత్నాల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి సరికొత్త అధ్యాయాన్ని లిఖించామన్నారు. 79 లక్షల మంది అక్కా చెల్లెమ్మలకు డ్వాక్రా రుణమాఫీ కింద నాలుగు విడతల్లో రూ. 25 వేల కోట్లు అందజేశామన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు ఏ ఒక్క హామీని అమలు చేయలేదని దుయ్యబట్టారు. జాబు కావాలంటే బాబు రావాలని ఊదరగొట్టిన బాబు, తీరా అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కరికీ ఉద్యోగ అవకాశం కల్పించలేదని అన్నారు. ప్రజా సమస్యలనూ చంద్రబాబు ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అన్ని విధాలా ప్రగతి పథాన తీసుకెళ్తున్నారని కొనియాడారు. మరో నెల రోజుల్లో ఎన్నికలు రానున్నాయని, లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీని గెలిపించి మరోమారు జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలన్నారు. ఎంపీ అనురాధ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమం ప్రతి ఇంటి గడపను తట్టిందన్నారు. ఈ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం జగన్‌తో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, పి.గన్నవరం పార్టీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీను, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ, జిల్లా కార్యదర్శి మెరికల శ్రీను, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు యల్లమిల్లి బోసు, సర్పంచ్ బొమ్మి బాలవేణి తదితరులు పాల్గొన్నారు.

వెండి చీర, వడ్డాణం సమర్పణ



వెండి ఆభరణాలు సమర్పిస్తున్న తాతాజీ

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయంలో అమ్మవారికి కాకినాడకు చెందిన చిక్కాల చౌదరయ్య (తాతాజీ), సత్యపూర్ణలక్ష్మి దంపతులు సుమారు రూ.6.5 లక్షల విలువైన వెండి ఆభరణాలు సమర్పించారు. వెండి చీర, వెండి వడ్డాణంతో పాటు రెండు కర్ణపత్రాలు, రెండు కమల హస్తాలు, రెండు అభయహస్తాలు, బుట్ట చీరాభరణం వంటివి ఏడున్నర కిలోల వెండితో తయారు చేయించారు. పూజల అనంతరం రాజ్యలక్ష్మి అమ్మవారికి ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈఓ భీమేశ్వరరావు, అర్చకులకు అందజేశారు. అలాగే అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వెండి వడ్డాణాలు చేయించారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం

జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు



ఆదిమూలంవారిపాలెంలో విప్పర్తి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన కార్యకర్తలు

పి.గన్నవరం: వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, పార్టీకి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణే అందుకు నిదర్శమని పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. ఊడిమూడి శివారు ఆదిమూలంవారి పాలెంలో నాల్గో వార్డు సభ్యుడు చిలకలపూడి సురేష్ ఆధ్వర్యంలో శనివారం 50 కుటుంబాల ప్రజలు విప్పర్తి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఆయన వైఎస్సార్ సీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలన మెచ్చి ఇతర పార్టీల శ్రేణులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని వివరించారు. జిల్లా వాణిజ్య విభాగం నాయకుడు మంతెన రవిరాజు, సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, నాయకులు సాధనాల రమేష్, మేడిశెట్టి నాగేశ్వరరావు, రాంబాబు, దూలం రాంబాబు, ఆదిమూలం వెంకటేశ్వరరావు, కొల్లు రాంబాబు, బండి రమేష్, అడ్డగళ్ల వెంకట సాయిరామ్, తోలేటి బంగారునాయుడు, కొంబత్తుల ఏసుబాబు, దేశిరాజు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పోలీసులతో తన్నించినా

సహించిన ముద్రగడ

- ఆ అవమానాలన్నీ కాపుల కోసమే భరించిన సహనశీలి
- ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు



ముద్రగడపై కొందరు నాయకులు చేస్తున్న విమర్శలను ఖండిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: కాపుల హక్కుల కోసం పోరాడిన ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అని ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల బీసీ కుల సంఘాల పోరాట కమిటీ కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. చంద్రబాబు తన ప్రభుత్వంలో పోలీసుల బూటు కాళ్లతో ముద్రగడ ఇంట్లో ఆడవారిని తన్నించి ఎన్నో అవమానాలకు గురిచేశారని గుర్తు చేశారు. పదవులకు, ప్రలోభాలకు ఏనాడూ లొంగకుండా తన ఆస్తిని హారతి కర్పూరంలా హరింప చేసుకుంటున్న ముద్రగడ ఈ అవమానాలు, ఇబ్బందులను కేవలం కాపుల హక్కుల సాధన కోసమే భరించారన్నారు. ఆయన ఎంతో సహనశీలి అని ఎమ్మెల్సీ అన్నారు. అమలాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో బీసీ నాయకులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ముద్రగడ త్యాగాల గురించి వివరించారు. అలాంటి నిస్వార్థ వ్యక్తి, అజాత శత్రువుపై కొందరు కాపు నాయకులు నేడు ఆరోపణలు, విమర్శలు చేయడం తగదని స్పష్టం చేశారు. పలు ఉద్యమాలు, పోరాటాలతో టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు మెడలు వంచారని గుర్తు చేశారు. ఏటా కాపు విద్యార్థులకు రూ.2 వేల కోట్ల మేర స్కాలర్‌షిప్‌లు అందుతున్నాయంటే ముద్రగడ పోరాట ఫలితమేనని చెప్పారు. రాజకీయాలనే కాదు, ఉద్యమాలను కూడా హుందా నిర్వహించిన ముద్రగడపై కొందరు కాపు నాయకులు చేస్తున్న విమర్శలను ఆయన ఖండించారు. అలాంటి విలువలున్న ఉద్యమ నాయకుడు ముద్రగడ నేడు వైఎస్సార్ సీపీలోకి వచ్చేందుకు నిర్ణయించుకోవడం పట్ల ఎమ్మెల్సీతో పాటు బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన రాకను సమావేశం స్వాగతించింది. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ లీగల్ సెల్ నాయకుడు కుడుపూడి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న క్షేత్రం.. ఆధ్యాత్మిక శోభితం



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: దినదిన ప్రవర్ధమానంగా.. ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న వాడపల్లి క్షేత్రం శనివారం భక్తజనంతో శోభిల్లింది.. ఆ వేంకటేశ్వరుడిని దర్శించుకున్న భక్తుల మది పులకించింది.. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం కిక్కిరిసింది. ఉదయం నుంచీ అధిక సంఖ్యలో భక్తులు గౌతమీ గోదావరిలో స్నానాలు ఆచరించారు. పూర్ణాలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలోని వేంకటేశ్వర స్వామి క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి, ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులు తరలిరావడంతో అంతటా గోవింద నామస్మరణ మార్మోగింది. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఈఓ కిశోర్ కుమార్ మాట్లాడుతూ స్వామివారి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ ద్వారా సుమారు రూ.41.22 లక్షల ఆదాయం సమకూరిందన్నారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

గోకవరం: మండలంలోని భూపతిపాలెం ఏపీఆర్ గురుకుల పాఠశాలలో ఆయా తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు ప్రిన్సిపల్ బి.రవి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐదో తరగతికి 80 సీట్లు, ఆరు, ఏడు, ఎనిమిదో తరగతుల్లో ఖాళీలకు గాను తగిన అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదో తరగతిలో ప్రవేశానికి గుర్తింపు పొందిన పాఠశాలలో 2023–24లో నాల్గవ తరగతి, ఆరో తరగతికి ఐదో తరగతి, ఏడో తరగతికి ఆరో తరగతి, ఎనిమిదో తరగతికి 2023–24లో ఏడో తరగతి విద్య అభ్యసించి ఉండాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.లక్షకు మించకుండా, తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉండాలన్నారు. అలాగే రాష్ట్రంలోని ఏడు ఏపీఆర్ జూనియర్ కళాశాలలు, నాగార్జున సాగర్‌లోని ఏపీఆర్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించారన్నారు. సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31 వరకూ గడువు ఉందని, దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 25న ఆయా జిల్లా కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఇతర వివరాలకు పాఠశాల పనివేళల్లో సంప్రదించాలని ఆయన వివరించారు.

చిన్నారి గుండెకు ఊపిరి

- విజయవంతంగా శస్త్రచికిత్స
- ఆరోగ్యశ్రీలో ప్రభుత్వ వైద్యం
- వివరాలు వెల్లడించిన వైద్యులు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు, చిత్రంలో క్షేమంగా ఉన్న లక్ష్మీసౌమ్యతో తండ్రి

కాకినాడ రూరల్: ఆ చిన్నారికి పుట్టకతో గుండె సంబంధిత సమస్య వచ్చింది. ఈ సమస్య తీవ్రం కావడంతో తల్లిదండ్రులు కొన్ని నెలలుగా ఆస్పత్రులు చుట్టూ వైద్యం కోసం తిరిగారు. కొందరు సర్జరీ చేయాలని, మరి కొందరు రూ.5 లక్షల వరకూ ఖర్చు అవుతుందని చెప్పడంతో చిన్నారి తల్లిదండ్రులు మదన పడ్డారు. చివరికి గుండె వద్ద ఏ విధమైన కోత, సర్జరీ లేకుండానే అత్యాధునిక వైద్యంతో పైసా ఖర్చు లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందింది. పాప ప్రాణాలకు ఇబ్బంది లేకుండా కాకినాడ అచ్చంపేట జంక్షన్ వద్ద మెడికవర్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఇందుకు సంబంధించి వివరాలను శనివారం మెడికవర్ ఆస్పత్రిలో మీడియా సమావేశంలో పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ అల్లూరి అశోక్‌రాజు, కార్డియాలజీ వైద్యులు మాతా శ్రీనివాస్. పి.ప్రణవ్, నరేష్ వివరించారు. భీమవరం జిల్లా నరసాపురానికి చెందిన యాళ్ల బండి రామకృష్ణ కుమార్తె లక్ష్మీ సౌమ్య (6) గుండెలో రంధ్రంతో బాధపడుతుంటే తమ వద్దకు వచ్చారని, సర్జరీ పద్ధతిలో కాకుండా మొట్టమొదటి సారిగా డివైస్ క్లోజర్ ప్రొసీజర్ ద్వారా చిన్నారి గుండెకు శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించామన్నారు. చిన్నారి గుండెలో ఏట్రియల్ సెప్టల్ డిఫెక్ట్ అనే పెద్ద రంధ్రం ఉన్నట్టు నిర్ధారణ కావడంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రంధ్రం మూసివేశామన్నారు. రెండు రోజుల్లో బాలిక కోలుకుందన్నారు. ఆస్పత్రి హెడ్ సిద్ధారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో అయితే బాలిక గుండె వైద్యం కోసం రూ.5 లక్షల వరకూ ఖర్చు అయ్యేదని, కానీ తమ ఆస్పత్రిలో రూపాయి కూడా ఖర్చు లేకుండా బాలికకు శస్త్రచికిత్స చేశామని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా వైద్య ఖర్చులు పూర్తిగా భరించిందన్నారు. బాలిక తండ్రి రామకృష్ణ మాట్లాడుతూ తనకు పాప, బాబు సంతానమని పాప ఒకటో తరగతి చదువుతుందన్నారు. బాలిక ఆరోగ్యం బాగోకపోతే చాలా ఆస్పత్రులకు తిరిగామని, ఒక వైద్యుడి సూచన మేరకు మెడికవర్ ఆస్పత్రికి రావడంతో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందించారన్నారు. ఇందుకు వైద్యులతో పాటు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.